# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 19 సెప్టెంబరు, 2024 | పేజీలు : 5





**నల్లగొండ జిల్లాను బంగారు కొండగా మారుస్తాం**

# ప్రతీ ఇంటిని సర్వే చేసి పక్కాగా ఓటరు జాబితా



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రతి ఇంటిని సర్వే చేయాలని, పక్కాగా పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్షాలోమ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు అయిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్లు అయిన తహశీలుదార్లతో ఇంటింటి సర్వే ద్వారా చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు ఇంటింటి సర్వే, ఓటరు జాబితా సవరణపై, యాప్ వినియోగంపై, ఫామ్ 6,7,8 నిర్వహణ పట్ల తగిన శిక్షణ అందించాలని, సంబంధిత రిజిష్టర్లను పక్కాగా నిర్వహించేలా చూడాలని, ఎఆర్ఓలు, ఎఇఆర్ఓలు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను నిర్ణీత సమయంలో తనిఖీ చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేకు ఇప్పుడు మంచి అవకాశం, వెసులుబాటు ఉందని, సర్వేలో కుటుంబాల వివరాలు, అడ్రస్సులు సరిగా పరిశీలించాలని, ఫోటోలు, అడ్రసులను, తప్పులున్న చోట సరిచేయాలని తెలిపారు. దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్త పోలింగ్ కేంద్రాలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లను తొలగించేందుకు నిబంధనలను పాటించాలని, కుటుంబ సభ్యుల నుండి మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. బూత్ లెవల్ అసిస్టెంట్లను నియమించేలా రాజకీయ పార్టీలకు లేఖలు వ్రాయాలని, డ్రాఫ్ట్ ఎలక్టోరల్ జాబితాలను వారికి ఇవ్వాలని తెలిపారు. అలాగే మార్కుడు ఎలక్టోరల్ జాబితాను, దివ్యాంగులు, ఓల్డ్ ఏజ్ ఓటర్ల పరిశీలన జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. క్రమం తప్పకుండా ఈవిఎం గోదాములను, రిజిష్టర్ల నిర్వహణను తనిఖీ చేయాలని తెలియచేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించాలని, ఓటర్ల వివరాలను పరిశీలించాలని, మార్పులు చేర్పులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేస్తూ తేదీ. 01/01/2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే ప్రతి ఒక్కరిని ముందస్తుగానే గుర్తించి ఓటరు నమోదు చేపట్టాలని తెలిపారు. అనంతరం భువనగిరి పట్టణంలోని మాస్కుంట 52 నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని, రాయగిరి 49, 50 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పరిశీలించారు.

# పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి గ్రామంలో ఈనెల 10న మండల స్పెషల్ ఆఫీసర్ జాకప్ ఆకస్మిక తనిఖీ నిర్వహించగా అక్కడ పంచాయతీ సెక్రటరీగా ఉన్న మాంద్ర సైదులు అం దుబాటులో లేకపోవడంతో తక్షణమే ఎంపిడివో లక్ష్మికి సమాచారం ఇవ్వ డంతో ఎంపిడిఒ గ్రామ పంచాయతీకి వెళ్ళి పంచాయతీ సెక్రటరీకి ఫోన్ చేయగా సెలవు పెట్టకుండా, గ్రామ ప్రజలకు అందుబాటులో లేకపో వడం తో పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తెలప డం తో మండల అధికారులు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి సమా చారం ఇవ్వడంతో పంచాయతీ సెక్రటరీపై ఎంక్వైరీ చేయించి పంచా యతీ సెక్రటరీని తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ మండలా ధికారులకు సూచించడంతో మండల స్పెషల్ అధికారి, ఎంపిడివో పంచాయతీ సెక్రట రీ సైదులకు సస్పెండ్ పత్రాన్ని అందించారు. పోలేపల్లి గ్రామానికి తక్షణ మే పంచాయతీ సెక్రటరీని నియమించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

### ఫ్రీ బస్ ప్రయాణంతో

# ప్రయాణికుల అవస్థలు

**ఆర్డీనరి, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తక్కువ..డీలక్స్‌లు ఎక్కువ..**



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం మహాలక్ష్మి పేరుతో ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేశారు. పల్లెవెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ పల్లెలు, పట్టణాలలో ఆర్డీనరి, ఎక్స్‌ప్రెస్‌లు లేక ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే నాన్ స్టాపే శరణ్యంగా డబ్బులు చెల్లించి మహిళలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేయడం సంతోషకరమైన విషయమైనప్పటికీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు సరిపడా లేక పోవడంతో ఒక్క బస్సులో పరిమితికి మించి ఎక్కడంతో వృద్ధులు చిన్నపిల్లలు విద్యార్థులు ఉద్యోగస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకాన్ని పెట్టడం ద్వారా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బస్సులో ఉన్న సీట్లను ఆక్రమించుకోవడంతో పురుషులు టికెట్ కొని గంటలకు నిలబడే ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. కొంతమంది మహిళలు కూడా ఈ ఫ్రీ బస్సు పథకాన్ని తొలగించాలని ఎందుకంటే బస్సు అంతా మహిళలతో నిండిపోయి పురుషులకు, వృద్ధులకు, వికలాంగులకు, చిన్నారులకు సీట్లు దొరకక అనేక అవస్థలు పడుతున్నారని ఈ ఫ్రీబస్సు పథకాన్ని తొలగించి ప్రభుత్వం విద్య , వైద్యం, రోడ్ల మరమ్మతులకు కేటాయిస్తే ప్రజలందరికీ ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది ప్రయాణికులు మాత్రం ప్రయాణికులకు సరిపడా బస్సులు వేస్తే బాగుంటుందని లేనియెడల పథకాన్ని పూర్తిగా తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ ఫ్రీ బస్సు పథకం ద్వారా ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నా సందర్భంగా ప్రభుత్వం పునరాలోచించి అందరికీ ఒకే విధంగా టికెట్ కొని ప్రయాణించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## పంట నష్టపరిహారం చెల్లించాలి





## రాజగోపాల్ రెడ్డికి ఘన స్వాగతం


ప్రజాపక్షం/ మునుగోడు : వ్యక్తిగత పనులపై బుధవారం బెంగళూరుకు వెళ్ళిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిని మునుగోడు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ జెడ్పిటిసి నారబోయిన రవి స్వరూప రాణి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తమ నివాసానికి ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు బెంగుళూరులోని వారి నివాసానికి వెళ్లిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి తమ సహచర మిత్రులతో కలిసి స్వాగతం పలికారు.

## నిమజ్జనంలో అపశృతి

ప్రజాపక్షం /మర్రిగూడ: మండలములోని కొండూరు గ్రామపంచాయతీ పరిధి తూర్పు తండాకు చెందిన జరుపుల శంకర్ నాయక్ మంగళవారం రాత్రి వినాయక నిమజ్జనం చేస్తుండగా నీటిలో మునిగి మృతి చెందాడు.

## ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్

యాదగిరిగుట్ట : మండలంలోని కాచారం గ్రామంలో కైలాసపురి క్షేత్రంలో ఎల్లమ్మ తల్లి అమ్మ వారిని మంగళవారం ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి దర్శించుకున్నారు. వీరితో ఆర్య వైశ్య సంఘం పెద్దలు కుకుటపు చంద్రశేఖర్ గుప్తా, తుర్కపల్లి మండల ఆర్యవైశ్య సంగం అధ్యక్షులు వెల్దా కనకరాజు గుప్తా, తిరుమలాపూర్ మాజీ ఉప సర్పంచ్ సముద్రాల వెంకటేష్ గుప్తా, చాడ కర్ణాకర్ రెడ్డి ఉన్నారు. అనంతరం చైర్మన్‌కు ఆలయ పురోహితులు ఆశీస్సులు అందించి శాలువలతో సన్మానించారు.



# విద్యార్థులు తప్పిపోవడం పట్ల ఆగ్రహం



ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు తప్పిపోవడం పట్ల బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఎ రమావత్ రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన ముగ్గురు విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చి వారి తల్లితండ్రులకు అప్పగించాలని, ప్రభుత్వ నిర్లక్ష్యం వలన గురుకుల పాఠశాలలు అధ్వానంగా మారుతున్నాయని ఆయన వాపోయారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి అని గురుకులాల అధ్వాన్న పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యుడని ఆయన అన్నారు. కేసీఆర్ హయంలో వెలుగొందిన గురుకులాలు మీ నిర్లక్ష్యం కారణంగా మసకబారుతున్నాయని, ప్రతిపక్షాల మీద నోరుపారేసుకోవడం మానేసి ఇప్పటికైనా పాలన మీద దృష్టి పెట్టి మొద్దు నిద్ర వీడి గురుకులాల్లో విద్య, భోజనం, వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నెత్తురోడిన రహదారి... ఒకరు మృతి

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ లోని దయ్యాల గండి వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక సిఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం మొదట ఒక లారీకి చిన్న ప్రమాదం జరగటంతో లారీ డ్రైవర్ ఆ లారీని పక్కకు ఆపి మాట్లాడుతూ ఉండగా అంతలోనే సాగర్ నుంచి తివేగంగా హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ ఒక్కసారిగా హైదరాబాదు నుంచి సాగర్ వైపుకు నెమ్మదిగా వస్తున్న రెండు కార్లను బలంగా ఢీకొనడంతో ఒక కారులో ఉన్న మహిళ అక్కడికక్కడే మృతి చెందిందని మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు.మృతి చెందిన మహిళ జోగులాంబ గద్వాల జిల్లా, కెటి దొడ్డి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శ్రావణి గా గుర్తించడం జరిగిందని, ఆమె



స్వస్థలం పెబ్బేరు అని తెలిపారు. అయితే తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానిక ఏరియా కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, ప్రమాదానికి గల కారణాలు ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బీసన్న తెలిపారు.

## బిజెపి నాయకులు రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలి

ప్రజాపక్షం/సూర్యాపేట: బిజెపి, శివసేన నాయకులు ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని పిసిసి అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌లు అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆదేశాలతో బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బిజెపి, శివసేన నాయకుల వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు అటెమ్ట్ మర్డర్ కింద



కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల గురించి మాట్లాడకుండా బిజెపి నాయకులు ఇష్టానురీతిలో ప్రతిపక్షాలపై మాట్లడడం సరైంది కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, కౌన్సిలర్ వేములకొండ పద్మ, నాయకులు గండూరి రమేష్, తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, యలగందుల సాయి నేత తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కర్ల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీబీనగర్ మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు నూతన భవనాలు నిర్మించాలని శాస్త్రీయమైన టైం టేబుల్ సవరించాలని, కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ విధానానికి స్వస్తి పలకాలని, విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలను పెంచాలని, డిప్యూటీ వార్డులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధర్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వి.రమేష్, సిహెచ్ ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటిలో గురువారం దేవరకొండ ఎంఎల్ఎ నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని పట్టణంలో రూ. 3.50లక్షలతో డ్రైనేజి లైన్, వృద్ధాశ్రమం మధ్యలో ప్రహరీ గోడ, రూ. 26.46లక్షలతో మునిసిపాలిటి పరిధిలో మంచినీటి సరఫరా లైన్లు, రూ. 5లక్షలతో మాజీ మురుగునీరు వెళ్ళుటకు ఔట్‌లెట్ నిర్మాణం, రూ. 4లక్షలతో ఘన వ్యర్థాల నిర్వహణ, డంపింగ్ యార్డు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేయనున్నట్లు మునిసిపల్ కమీషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వైస్ చైర్మన్ రహత్‌అలి, కౌన్సిలర్లు పాల్గొననున్నారు.

## విద్యార్థులను గుర్తించి సమాచారం ఇవ్వాలి

ప్రజాపక్షం/దేవరకొండ: మండలంలోని కొండభీమనపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాల నుండి ఈనెల 17 మంగళవారం ఉదయం సమయంలో పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షేక్ తౌఫిక్ ఉమర్, ముజీబ్, అబ్దుల్ రెహమాన్ అనే విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పాఠశాల నుండి వెళ్ళిపోయారు. వీరిని గుర్తించిన వారు దేవరకొండ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీస్ వారు కోరారు. సమాచారం తెలిసిన వారు దేవరకొండ సిఐ నరసింహులు 8712670154, ఎస్ఐ రమేష్ 8712594598 లకు ఫోన్ చేయగలని తెలిపారు.

## అవినీతి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం /నార్కట్ పల్లి : నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో గత మూడు నాలుగు సంవత్సరాలుగా గ్రామపంచాయతీకి రావాల్సిన 40 లక్షల రూపాయలు కొబ్బరికాయల వేలంపాటి డబ్బులు ఇంతవరకు చెల్లించని వారిపై చర్యలేవని బిఎస్‌పి మండల కార్యదర్శి మేడి వాసుదేవ్ అన్నారు. గ్రామంలో చిల్లర దొంగపై చేసిన అరాచకం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం కాగా, అదే గ్రామంలో 40 లక్షల రూపాయల స్కామ్ జరిగి చాలా కాలమైనా దానిపై గ్రామ యువకులు కొంతమంది స్పందించిన మెజారిటీ ప్రజలు మాత్రం స్పందించకపోవడం ఆశ్చర్యకరం కల్గించిందన్నారు.30 రూపాయలు దొంగతనం చేసిన మతిస్థిమితం లేని వ్యక్తి పైన తీసుకున్న చర్యలు 40 లక్షల స్కామ్ చేసినటువంటి వ్యక్తుల పైన ఎందుకు తీసుకోవడం లేదని ఇది కాదా అన్యాయం, ఇది కాదా దోపిడి అని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా గ్రామ ప్రజలు చిత్తశుద్ధితో గ్రామపంచాయతీకి రావాల్సిన 40 లక్షల రూపాయలను చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ యంత్రాంగం పైన ఒత్తిడి తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

# అక్రమ సంబంధం ఉందనే అనుమానంతోనే యువకుడి హత్య

ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

హత్య కేసు వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రవి

ప్రజాపక్షం/సూర్యాపేట: తన భార్యతో యువకుడు అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో యువకుడిని హత్య చేసిన సంఘటన నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈనెల 10న డికొత్తపల్లి ఎస్ఆర్ఎస్ కాల్వ సమీపంలో తిరుమలగిరి పట్టణానికి చెందిన యువకుడు కిరణ్ కుమార్ హత్య చేసు వివరాలను బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి రవి వెల్లడించారు. తిరుమలగిరి పట్టణానికి చెందిన నిందితుడు పత్తేపురం విజయ్‌కు గత ఆరు సంవత్సరాల క్రితం జనగామ జిల్లా దేవరుప్పల మండలం గొల్లపల్లికి చెందిన యాదగిరి కుమార్తె సుమలతతో వివాహమైంది. విజయ్ భార్య సుమలతో పట్టణానికి చెందిన



కిరణ్ కుమార్ అక్రమ సంబంధం పెట్టుకున్నాయని భర్తకు అనుమానం కలిగింది. దీంతో కిరణ్ కుమార్‌ను అడ్డు తొలగించాలని భావించిన విజయ్ తన బావ దుర్గం సైదులు, దుర్గం బాబు, మామిడి ఎల్లయ్య, స్నేహితులైన వడ్డె పున్నం, చంద్రశేఖర్‌లను సంప్రదించాడు. వారందరికి తిరుమలగిరికి పిలిచి కిరణ్ కుమార్‌ను హత్య చేయాలని పథకంను వివరించాడు. అందులో భాగంగా ఈనెల 10న తన బావతో రెక్కి నిర్వహించి కారు కిరాయికి వెళ్లిన మృతుడు కిరణ్ ఇంటికి తిరిగి వస్తాడని నేరస్తులందరిని తిరుమల హిల్స్ సిసిరోడ్డు వద్దకు రప్పించాడు. శ్రీకాంత్‌ను అతని వద్ద ఉన్న కారును నకిరేకల్‌కు వెళ్లి వస్తానని సెల్ఫ్ డ్రైవ్‌కు తీసుకొని ముందుగానే కారులో నైలాన్ తాడు, కూరగాయలు కోసే కత్తి, చాపలు నరికే కత్తి, ముంజలు నరికే కత్తులను పెట్టుకున్నారు. ముందుగా చెప్పకున్న పథకం ప్రకారం తిరుమల హిల్స్ వద్దకు కిరణ్ రాగానే బలవంతంగా కారులో ఎక్కించి డి కొత్తపల్లి ఎస్ఆర్ఎస్‌పి కాల్వ వద్దకు తీసుకవచ్చి అక్కడే హత్య చేసి, హత్యకు ఉపయోగించిన కత్తులను శాలిగౌరారం మండలం మాధవరంకు చెందిన నీలకుంట చెరువు అలుగు వద్ద పొదల్లో పడేశారు. నిందితులను నకిరేకల్ మండలం కానగోడు బొప్పారం గ్రామంలో నాగారం సిఐ, ఎస్ఐలు అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరికి విచారించగా పత్తేపురం విజయ్ భార్య సుమలతతో కిరణ్ క్రమసంబంధం పెట్టుకున్నాడని భావించి హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. హత్య చేసిను చేధించిన సిబ్బందిని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.



## మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పించి, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ కొరారు. బుధవారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటి ఆద్వర్యంలో ఇంచార్జ్ డిఎంహెచ్ఓ యశోధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్దంగా అనేక ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజల వద్ద నుండి డబ్బులు లాగుతున్నాయని తెలిపారు. కనీసం లైసెన్స్‌లు కూడా లేకుండా అక్రమంగా అసుపత్రులు నడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు ఏర్పుల గాలయ్య, కొంగరి లింగస్వామి, మస్కు కిరణ్, వెలువర్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.23,516 పలికిన వినాయక లడ్డు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని బోగారం గ్రామంలో శ్రీ రాఘవేంద్ర యూత్ ఏర్పాటు చేసిన వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు లడ్డు వేలం పాటలో గ్రామానికి చెందిన గోగు మహేశ్వరి సత్యనారాయణయాదవ్ దంపతులు గ్రామంలోనే అత్యధికంగా రూ.23,516కు లడ్డును కైవసం చేసుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వారి దంపతులకు యూత్ సభ్యులు లడ్డుని అందచేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి ప్రసాద్, కూనూరు రాజు, గుంతకల్ల నవీన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మెట్టు శ్రవణ్, బద్దుల మహేష్, కూనూరు నరేష్, నేరేడు సురేష్, బొడ్డుపల్లి హరిప్రసాద్, గోగు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి...



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** పిల్లలపై తల్లితండ్రులు శ్రద్ధ వహించాలని కొండమల్లేపల్లి జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, బాలాజీ, సుధాకర్, గణేష్, అనురాధ, స్వాతి, శోభారాణి, సైదానాయక్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ ఎల్ఐసి బ్రాంచ్ 2 లో ఏజెంట్ ఎండి హుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా తోటి ఎల్ఐసి ఏజెంట్లు వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. చనిపోయినందున వారి కుటుంబానికి ఏజెంట్ల ఆర్గనలియాఫీ నుండి కొంత మంది ఏజెంట్ల సహకారంతో వారి కుటుంబానికి11 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కన్వీనర్ గోసుకొండ మురళి, బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గందు వెంకట్ గౌడ్, రామస్వామి పాల్గొన్నారు.

# ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి క్రైస్తవుల గణన చేపట్టాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణనతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఓబిసి క్రైస్తవుల గణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ బేతెస్థ మిని స్ట్రీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు క్రైస్తవులకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. క్రైస్తవ, ముస్లిం మతాల్లోకి మారిన దళితులకు ఎస్‌సి హోదా కల్పించే అంశంపై అధ్యానం చేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. దళిత క్రైస్తవ, ముస్లింలకు ఎస్‌సి రిజర్వేషన్ హోదా అంశం మరోసారి తెరపైకి వచ్చిందన్నారు. ఈ విషయమై త్వరలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోఆర్డీనేటర్ పాస్టర్ సిహెచ్ శ్యామ్ ప్రసాద్, జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, రెవ డాక్టర్ జలగం జేమ్స్, బొక్క ఏలీయా రాజు, రాజు, కొండేటి లాజర్, రూబెన్, క్రిస్టోఫర్, మార్క్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# హనుమపురంలో కుక్కల ఆసుపత్రిని రద్దు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి మండలంలోని హనుమాపురం గ్రామంలో కుక్కల హాస్పిటల్ ని రద్దు చేయాలని గొర్రెల మేకల పెంపకార్ల సంఘం జిల్లా అధ్యక్షులు దయ్యాల నరసింహ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే జండగే కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హనుమాపురం గ్రామంలో సర్వేనెంబర్ 28 లో కుక్కలకు సంబంధించిన ఆసుపత్రి ఇలాంటి సమాచారం లేకుండా, గ్రామసభ తీర్మానం లేకుండా పాలకుల ఇష్టానుసారంగా మున్సిపల్ అధికారులకు భూములు ఇవ్వడం జరిగిందని చెప్పారు. కుక్కల ఆపరేషన్ పేరుతో గ్రామాల్లో, పట్టణాల్లో కుక్కలను పట్టుకొచ్చి గల కుక్కలకు పట్టుకొచ్చి ఒక గ్రామంలో విడిచిపెట్టడం వల్ల వందల కుక్కలు గ్రామ ప్రజలపై



గొర్రెలపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పండుగ సురేష్, ఎర్రబోయిన కిష్టయ్య, నాయిని బాలయ్య, మైలారం స్వామి, దుర్గం నరసింహ, ఎర్రబోయిన అంజయ్య, ముద్దం కొమురయ్య, ఎర్రబోయిన వెంకటయ్య, గొరింకల ఆంజనేయులు పాల్గొన్నారు.

# వడపర్తి ఆగా చెరువులోకి గోదావరి నీళ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** వడపర్తి ఆగా చెరువులోకి గోదావరి నీళ్లు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి దయ్యాల నరసింహ కోరారు. జిల్లా నీటిపారుదల శాఖ డిఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దయ్యాల నరసింహ మాట్లాడుతూ భువనగిరి మండలం వాడపర్తి గ్రామ పరిధిలో ఆగ చెరువులోకి కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా గోదావరి నీరు అందించాలని కోరారు. ఆ గ్రామంలో చెరువు చుట్టు ప్రక్కల గ్రౌండ్ వాటర్ తగ్గిపోవడం వల్ల వరి చెనులు ఎండిపోతున్నాయన్నారు. దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఈ ప్రాంతంలో వర్షాలు తక్కువ పడడంతో చెరువులకు ఒక్క చుక్క నీరు రాక పొలాలు ఎండిపోతున్నాయి. కావున తుర్కపల్లి మండలం నుండి గొల్లగూడెం, పల్లె పహాడ్ గ్రామాల మీదుగా కొత్త బావి తండా చెరువులోకి కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా ఈ చెరువు నింపితే పెద్దతండం, రుస్తాపురం చెరువుల నుండి ఎలాంటి కాలువలు లేకుండా వడపర్తి ఆగా చెరువు నిండడంతో పాటు హనుమపురం, మద్దెలపల్లి చెరువు నిండడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. వెంటనే అధికారులు కాలువను పరిశీలన చేసి నీరు అందించి ఈ ప్రాంత రైతులను ,మత్స కార్మికులను వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వనపర్తి మాజీ ఉపసర్పంచ్ సిపిఎం మండల కమిటీ సభ్యులు పాండాల మైసయ్య, గ్రామ రైతులు ఎం.వెంకటేశం, ఎం.మల్లేశం, ఎం సుదర్శన్, ఎమ్ రాజు, సి.ప్రవీణ్, ఎం.శ్రీశైలం, ఎం.నరసింహ, ఎం.ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెదురు ఉత్పత్తులను వాడాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: పర్యావరణాన్ని పరిరక్షించాలంటే, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడంతో పాటు, వెదురు ఉత్పత్తులను మాత్రమే వాడాలని బిసి సంఘాల నాయకులు చక్రహరి రామరాజు, సోమ మల్లయ్యలు పేర్కొన్నారు. బుధవారం పంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మేదరి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిసి సంఘాల నాయకులు చక్రహరి రామరాజు, సోమ మల్లయ్యలు హాజరై మాట్లాడుతూ మనిషి పుట్టినప్పటినుంచి వెదురుతో జీవన విధానం ముడిపడి ఉందని అన్నారు. సెప్టెంబర్ 18వ తేదీని ప్రపంచ వెదురు దినోత్సవం గా ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు నోముల రవి, ప్రధాన కార్యదర్శి నోముల నరేందర్, కోశాధికారి నోముల గణేష్, ప్రచార కార్యదర్శి జోర్రీగల రామకృష్ణ, గౌరవాధ్యక్షులు జోర్రీగల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులు నోముల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## 11 కె.వి విద్యుత్ స్తంభాలు వేసినా అమర్చని విద్యుత్ వైర్లు



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలోని గోండ్రియాల గ్రామానికి చెందిన రైతుల వరి పంట పొలాల్లో 11కె.వి విద్యుత్ స్తంభాలు వేసి 15 రోజులు కావస్తున్నా ఇంత వరకు విద్యుత్ వైర్లు అమర్చలేదని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వందకు పైగా ఎకరాలు ఎండి పోతున్నాయని రైతులు,కౌలురైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పాలేరు వారు వరదకు వేల ఎకరాల వరిపంట పొలాలు నీట మునిగిపోయాయని,ఉన్న కొద్దిపాటి పొలాన్ని కాపాడుకుందామంటే విద్యుత్ అధికారులు 28 విద్యుత్ స్తంభాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.మా గోడు పట్టించు కోవాలని విద్యుత్ ఏఈ,డిఈలకు చరవాణి ద్వారా సంప్రదించిన ఎలాంటి స్పందన లేదని తెలిపారు.ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతా ధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాలకు విద్యుత్‌వైర్లు అమర్చి వంద ఎకరాల వరి పంట పొలాలను కాపాడాలని రైతులు నాగయ్య, మురళి, రామారావు, తిరుమలరావు, శేషయ్య,బాపయ్య కోరుతున్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపెయిన్ 2024లో భాగంగా పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు వైఆర్‌జి కేర్ లింక్ సంస్థ ప్రతినిధులు ప్రియాంక, బాలజ్యోతిలు ఎయిడ్స్ వ్యాధి గురించి వివరిస్తూ ఎయిడ్స్ వ్యాధి ఒక అంటు వ్యాధి కాదని, ఇది ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుందని వివరించారు. ఇంఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు జి మాధవి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యా బోధనలు జీవితంలో ఉపయోగపడాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** ఉపాధ్యాయులు విద్యార్థులకు భోదించే బోధనలు వారి జీవితంలో ఉపయోగపడేలా ఉండాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండల నోడల్ అధికారి పి సైదానాయక్ అన్నారు. మున్సిపాలిటి కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం పరిశీలించిన సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులలో భాషా సామర్థ్యాన్ని, గణితంలో చతుర్విధ ప్రక్రియలను పెంచి వారి దైనందిన జీవితానికి అనుసంధానంగా ఉండేలా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల భోదనను, అభ్యసన ప్రక్రియలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు అంబటి సత్తయ్య, ఉపాధ్యాయులు బాధం భిక్షపతి, సరిత, కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, శారద, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## బేకరీలో చోరీ



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఓ బేకరీలో మంగళవారం రాత్రి చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బేకరీ యజమానులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే రాత్రి వేళం వేసుకుని వెళ్లామని ఉదయం వచ్చే వరకు షట్టర్ తాళం పగులకొట్టి ఉందని లోపలి వెళ్లి చూడగానే రూ.5వేల నగదు, కొంత సరుకు చోరీకి జరిగిందని తెలిపారు. బేకరీ యజమాని ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడలో సత్తా చాటిన షేక్ ఫౌజియా

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన షేక్ ఫౌజియా అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడలో సత్తా చాటారు. ఈ నెల 14,15 న అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీలు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలలో భారతదేశం తరుపున ఆడిన షేక్ ఫౌంజియా 24వ స్థానంలో నిలిచి సత్తా చాటారు. పోయిల్ ఉమెన్స్ సాటిలైట్ టోర్నమెంట్ క్రీడల్లో పాల్గొన్న షేక్ ఫౌజియా ప్రసుతం వరంగల్‌లో సివిల్ కానిస్టేబుల్ గా శిక్షణ పొందుతుంది. ఇంతటి సహకారం అందిస్తున్న పిటిసి వరంగల్ ప్రిన్సిపాల్ పూజ ఇంజారపుకు ఫౌంజియా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తిరందాసు విష్ణు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంట నూనెలతోపాటు పప్పు దినుసుల రేట్లు పెరిగి సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయన్నారు. దళారుల ఆగడాలను అరికట్టి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ధరలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## భక్తులకు అన్నదానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని అవంతీపురం ఎస్సీ కాలనీలోని వినాయక మండపం వద్ద బుధవారం అంబేద్కర్ వినాయక ఉత్సవ కమిటీ వితరణ కార్యక్రమానికి తహసీల్దార్ హరిబాబు హాజరై గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వమించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిమట పద్మమదార్, మాజీ ఎంపీటీసీ పర్వతం లింగయ్య, శివాజి, చత్రపతి యూత్ కమిటీ సభ్యులు సుధీర్‌బాబు, పద్మ, వీరయ్య, రవి, గువ్వ సైదులు, రవి, అజ్జు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మాజీ జెడ్‌పిటిసి పరామర్శ

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** నార్కెట్‌పల్లి మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన బత్తిని నర్సింహా ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను నల్లగొండ జిల్లా మాజీ ప్రజా పరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ పరామర్శలో నార్కట్ పల్లి మాజీ ఎంపిపి సూది రెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పి. ముత్తయ్య పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు కట్టుబడి ఉండాలి



**ప్రజాపక్షం/కోదాడ :** విద్యార్థులు విద్యార్థి నుండే పరిసరాల పరిశుభ్రతలకు కట్టుబడి ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు.బుధవారం కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.విద్యార్థినులు వారానికి రెండు గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం పనిచేయాలన్నారు. నేను నా కుటుంబం,నా ప్రాంతం,నా గ్రామం,నా ప్రదేశంతో పరిశుభ్రత కోసం పాటుపడాలని కోరారు.పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధుల నుండి కాపాడుకోవచ్చన్నారు.విద్యార్థినులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.గాంధీ, కళాశాల డైరక్టర్ నాగార్జునరావు, ఏవో కృష్ణారావు,వివిధ విభాగాధిపతులు రమేష్,నరేష్‌రెడ్డి,ఎజాజ్,స్రవంతి,అధ్యాపకులు ,మున్సిపల్ కార్యాలయ సిబ్బంది యాదగిరి, భవాని,విద్యార్థినులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జిల్లా ఎస్‌పి సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని విజయ విద్యా మందిర్ పాఠశాలలోని విద్యార్థులకు సిఐ చరమందరాజు,ఎస్ఐ ముత్తయ్యలు సైబర్ నేరాలు,గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై పోలీస్ కళాబృందంచే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ ముత్తయ్య మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు,డ్రగ్స్, మత్తు పదార్థాలు,గుట్కా వంటి వాటిపై పటిష్టంగా పనిచేస్తున్నామని,ఇంటర్‌నెట్‌ను విద్యార్థులు,యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.సైబర్ మోసాలపై 1930టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్,కానిస్టేబుల్స్ నాగరాజు,సత్య నారాయణ,హోంగార్డు రవీందర్, సైదానాయక్, పాఠశాల సిస్టర్ కుసుమ, ఉపాధ్యాయులు,కళాబృందం ఇంచార్జి యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ చారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంట పొలాలు ఎండిపోతున్నాయి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** అకాల వర్షాల వలన భారీ వరదలతో నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు పడిన గండిని పూడ్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన హుజూర్‌నగర్,మఠంపల్లి,మేళ్లచెర్వు,చింతలపాలెం మండలాల్లోని రైతుల పొలాలు ఎండి పోతున్నాయని మాజీ జడ్‌పిటిసి కొప్పుల సైదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని అమరవరం గ్రామంలో రైతులు బిఆర్ఎస్ నాయకులతో కలసి ఎండిపోతున్న రైతుల పొలాలను పరిశీలించారు. కాల్వ పనులు త్వరగా పూర్తిచేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుజ్జుల సుజాతఅంజిరెడ్డి, ఉస్తేల లింగారెడ్డి,కట్ట రాంరెడ్డి, నర్సిరెడ్డి, వెంకటాచారి,నాగిరెడ్డి,సైదులు, నాగయ్య,గోపయ్య పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టవద్దని డిమాండ్ చేస్తూ బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గంట నాగయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సోమయ్యలు గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు చెందే స్కీములను ప్రైవేట్, కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయ ఓఏకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కునుకుంట్ల సైదులు, అనంతుల మల్లయ్య, మాగి లింగయ్య, ఉపేందర్, శీలం వేణు, వెంకన్న, మంజుల, పద్మ, జహంగీర్, సామ నర్సిరెడ్డి, ఉపేందర్, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

## రైతులతో చెలగాటమాడుతున్న బ్యాంకర్లు

**ప్రజాపక్షం/వేములపల్లి :** రైతుల ప్రాణాలతో బ్యాంక్ అధికారులు చెలగాటమాడుతున్నారని మాజి వైస్ ఎంపిపి పాదూరి గోవర్ధన మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంటల పెట్టుబడి కోసం రుణాలు తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లిన రైతులతో బ్యాంకర్లు 25 వేల నుంచి 50 వేల వరకు ఇన్సూరెన్స్ చేస్తేనే లోన్ ఇస్తామని లేకుంటే ఇవ్వమని తెగేసి చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారని ఈ విషయంపై అధికారులు పట్టించకపోవడం బాధాకరమన్నారు. ఇదేమైనా కార్పొరేట్ వ్యాపారమా అని ఆమె ప్రశ్నించారు. రైతులు పంట పెట్టుబడులు లేక బ్యాంకులో వ్యవసాయ రుణాలు ఇవ్వక వ్యవసాయం ఎలా చేయాలని అయోమయో పరిస్థితిలో ఉన్నారన్నారు వ్యవసాయ రైతులతో వ్యాపారం చేస్తే సిపిఎం పార్టీ చూస్తూ ఊకోదని ఈ విషయంపై ఆందోళన చేపట్టి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం రాంబాబు, విఘ్నేషు, జానకమ్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉచితంగా అందించే ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్క్ స్టడీ మెటిరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె అశోక్, టిపియూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పర్వతం రంధ్యారాణి, యామా రమేష్, విద్యాశాఖ కోఆర్డీనేటర్ ఎర్రంశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తుది ఫోటో ఓటర్ల జాబితాపై సమావేశం

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలు 2024 నిర్వహణకై ఏర్పాటు చేసిన ఫోటో ఓటర్ల జాబితాను తుది నిర్ణయ పరిశీలనపై సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 13వ తారీఖున మండలం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితా ప్రదర్శించి షెడ్యూల్ వారీగా వాటిపై అభ్యంతరాలను స్వీకరించి గ్రామ పంచాయతీల వారీగా, వార్డుల వారీగా ఈనెల 28వ తారీకు వరకు చేయవలసి ఉన్నందున, ప్రముఖ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఈనెల 19వ తారీఖు గురువారం సమావేశం ఏర్పాటు చేసి తుది ఫోటో ఓటర్ల జాబితాను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కావున రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## గుత్త అమిత్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి మండలంలోని మాంద్ర గ్రామంలో అర్చకులు బ్రహ్మ శ్రీ ఉత్తరపల్లి నరసింహచార్యుల ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక అర్చనలు,పూజలు నిర్వహించారు. అనంతరంఉత్సవ కమిటీ యూత్ సభ్యులు ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద దాతలు గుండె రవి మహేశ్వరి విగ్రహాదాతలు దొండరమేష్ రాధిక దంపతులు గజమాల వేసి అమిత్ ను సన్మానం చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో గుండె బిక్షమయ్య దొండ మత్స్యగిరిగుండు నర్సింహ్మా ముదిరాజ్ చేత రాజు సత్తయ్య బిక్షం మిర్యాల ధనంజయ్య వెంకన్న వనం లక్ష్మమయ్య పంగ సత్య రాములు ఇంజమూరి రామలింగయ్య పాల్గొన్నారు.

## తాగునీటి సదుపాయం కల్పించాలి

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం గ్రామంలో తాగు నీరు లేక గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా తక్కువ మొత్తంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు అడుగంటి గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో ఉన్నటువంటి రెండు బోర్లు ఎండి పోవడంతో తాగు నీటికి తీవ్ర కొరత ఏర్పడింది. గ్రామంలో తాగు నీటి సమస్య ఏర్పడడంతో గుండాల మండల కేంద్రానికి వెళ్ళి చాలా వరకు తాగు నీటిని తీసుకొని వస్తున్నారని గ్రామంలోని వృద్దులు ఎటుపోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామానికి మంచి నీటి సమస్యను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, యువత కోరుతున్నారు.

# అంగన్‌వాడీలో నాణ్యమైన ఆహారం అందించాలి





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఆర్.మమత మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల తరువాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలను పట్టించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమాదేవి, అంగన్‌వాడి టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, అహ్మదిబేగం, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే అర్హులైన ప్రతి ఒక్కరికి నాన్యమైన ,పౌష్టికరమైన ఆహారాన్ని అదించాలని చండూరు సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎం. సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని బోడంగిపర్తి అంగన్వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. అందుకు పాలు, గుడ్లు, ఆకుకూరలు, మొలకెత్తిన పప్పు దినుసులు లాంటి పోషణ అందించే ఆహారంను తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎస్‌కె శభాన , వి. వనజాత, ఎన్‌ఎం శ్రీలత, ఆశాలు రోజా , గర్భవతులు , బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** పౌష్టికాహారంతోనే గర్భిణీలు,బాలింతలు,పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కోదాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో పారిజాతం అన్నారు.బుధవారం మండలంలోని నల్లబండగూడెం అంగన్‌వాడి కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ మహా సెప్టెంబర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాలైన ఆహార పదార్థాలను పండ్లను ప్రదర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు అంగన్‌వాడీల ద్వారా కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.గర్భిణీలు,బాలింతలు,పిల్లలు అనారోగ్య సమస్యలు కలగకుండా సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలన్నారు.సెప్టెంబర్ 1 నుండి 30 వరకు పోషణ మహా సెప్టెంబర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణ,పరమేశ్వరీ,అంతలక్ష్మి ,ఉమా,మమత,సుప్రియ,అన్నపూర్ణ,ఆశాలు,ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం /తిరుమలగిరి సాగర్** :ఐసిడిఎస్ అనుముల ప్రాజెక్ట్ పరిధిలోని తిరుమలగిరి మండలం కొంపల్లి గ్రామంలో రైతు వేదికలో అంగన్వాడి టీచర్లు పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ మాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఉదయశ్రీ పాల్గొని తల్లులకు గర్భిణిలకు బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జంగాల లక్ష్మమ్మ ,ఎసిడిపిఓ సువర్ణ ,ఎఎన్ఎం సరిత , సూపర్వైజర్లు యాదమ్మ ,విజయలక్ష్మి ,అంగన్వాడీ టీచర్లు ,ఆశావర్కర్లు ,గర్భిణి బాలింతలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి:** సెప్టెంబర్ మాసంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డిండి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర బాలికలకు హ్యాండ్ వాష్, ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో గర్భిణిలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిండి తహశీల్దార్ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ పోషక విలువల గురించి వివరించారు. చిన్నారులకు విద్యా ఆవశ్యకత గురించి ముఖ్యంగా బాలికల విద్యపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రసంగించారు. దేవరకొండ ఐసిడిఎస్, సిడిపివో చంద్రకళ మాట్లాడుతూ కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాలు, సిరిధాన్యాలు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని, ఐరన్ ఫుడ్ ఎక్కువగా తీనాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసిడిపివో ఖాకీజా బేగం, సూపర్‌వైజర్లు రేణుక, రమణ, విజయలక్ష్మి , మేరీ, చిట్టేమ్మ, సత్యకుమారి, ప్రసన్న, శోభ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆయాలు విద్యార్థులు పాల్గొన్నారు.







## కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం పలికిన నాయకులు


**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** వరంగల్ జిల్లా పర్యటనకు వెళ్తున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్‌ను భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డు న్యూ వివేర హోటల్ దగ్గర పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో మొదటిసారిగా పట్టణానికి విచ్చేసిన సందర్భంగా ఘనంగా సన్మానించి శాలువాలతో సత్కరించి మెమొంటో బహుకరించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో సరైన సముచిత స్థానాలు కల్పిస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కోసం నాయకులు అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేస్తూ ముందుకు సాగాలన్నారు. పథకాలను ప్రజలకు అందే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్, పట్టణ కౌన్సిలర్ పడిగెల రేణుక ప్రదీప్, దర్గాయి హరిప్రసాద్, మంగ ప్రవీణ్, ఏడుమేకల మహేష్, పల్లర యాదగిరి, సామల రవీందర్, ఆంజనేయ స్వామి, ఉపేందర్, నాకోటి రాము, హరీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు నిషేధించాలని ర్యాలీ

**ప్రజాపక్షం/ మునుగోడు :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని గూడపూర్ గ్రామాలలో బెల్ట్ షాపులలో మద్యం విక్రయించరాదని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.అనంతరం గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛందంగా బెల్ట్ షాపులు మూసివేయాలని గ్రామంలో పూర్తిగా మద్యం అమ్మకాలను నిషేధించి అందరికీ ఆదర్శంగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు మాట్లాడుతూ గ్రామాలలో మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించాలనేదే ఎంఎల్‌ఏ లక్ష్యమని ఈ మేరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునుగోడు మాజీ ఎంపిపి కర్నాటి స్వామి యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు జాల వెంకన్న యాదవ్,మిర్యాల వెంకన్న,సాగర్ల లింగస్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క వెంకన్న యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పరి యాదగిరి,సింగపంగం మల్లయ్య, దేశిడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలో విప్ బీర్ల

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మండలంలోని వేల్పుపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు గుండ సిద్ధులు కుమారుడు అభిరామ్ మొదటి పుట్టిన రోజు వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిదిగా హాజరై చిన్నారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి అభిరామ్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మధర్ డైరీ ఛైర్మెన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధనవాత్ శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు రాజారాం నాయక్, మల్లాపూర్ మాజీ ఎంపీటీసీ కర్రే వీరయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కూరెళ్ళ రాజాలు గౌడ్ పాల్గొన్నారు.




# మోత్కూరు ఎక్సైజ్ పరిధిలో వైన్ షాపులు ఇష్టారాజ్యం




**ప్రజాపక్షం/మోత్కూరు:** మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వైన్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మాతాన రూల్స్ జాన్తానై అంటూ.... రూల్స్ బ్రేక్ చేస్తూ, విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు వైన్ షాపుల యజమానుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మోత్కూరు ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), వలిగొండ మండలాలు ఉండగా ఇప్పటికే సిండికేట్ గా మారి బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పర్మిట్ రూంలను కూడా బార్లను తలపించేలా నడుపుతున్నారన్నది బహిరంగ రహస్యమే. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఎక్సైజ్‌సీఐ మాత్రం తనకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తూ తలాతోకా లేని సమాధానాలు చెబుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కాగా గణేష్ నిమజ్జనం సందర్భంగా రాచకొండ సీపీ పరిధిలో మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం సాయంత్రం 6 వరకు వైన్ షాపులు మూసేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. అంతటా ఎలా ఉన్నా ఆ రూల్స్ మేం పాటిస్తామా అంటూ మోత్కూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మోత్కూరుతో పాటు మిగతా మండలాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత వైన్ షాపులన్నింటినీ తెరిచి అమ్మకాలు ప్రారంభించారు. వైన్ షాపులను కూడా మంగళవారం మూసేసే సందర్భంగా సీల్ వేయలేదని తెలుస్తోంది. ముందే షాపులు తెరవడంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం కొనేందుకు బారు లు తీరారు. సమయం కన్నా ముందే ప్రభుత్వ రూల్స్‌ను ఖాతరు చేయకుండా వైన్ షాపులు తెరవడంతో విషయాన్ని మోత్కూరు ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మద్యం వ్యాపారులను వెనకేసుకొస్తూ పొంతన లేని సమాధానాలు చెప్పారు. మీ వివరణ చెప్పండని అడగ్గా రేపు కార్యాలయంకు వచ్చి పర్సనల్గా కలవండని, మద్యం ప్రియులకు చల్లటి బీర్లకు ఇబ్బంది అవుతుందని ముందే తెరవమని చెప్పామన్నారు.